

లోక్ అదాలత్‌ను..

బోధన్ కోర్టులో ఈ నెల 28న నిర్వహించనున్న లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోర్టు అధికారులు కోరారు.

- 8లో ▸



విద్యుత్‌తో భద్రం

గణేశ్ మండపాల వద్ద నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలి. నిమజ్జన సమయంలో అప్రమత్తంగా ఉండాలి.

- 8లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 31.0 /22.2

ఉదయం చల్లనిగాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ తేలికపాటి వాన కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

వినాయకుడికి కలెక్టర్ పూజలు



నిజామాబాద్‌అర్బన్: కలెక్టరేట్‌లో ప్రతిష్ఠించిన వినాయకుడికి కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అదనపు కలెక్టర్ అంకిత్, ట్రైయినీ కలెక్టర్ సంకేత్ కుమార్, రెవెన్యూ ఉద్యోగుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రమణ్‌రెడ్డి, కలెక్టరేట్ సూపరింటెండెంట్ శ్రీనివాస్, కలెక్టరేట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి



నవీపేట: ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో బీఎల్‌వోలకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన బీఎల్‌వోల సమావేశంలో ఆయన మాట్లాడారు. 18 ఏళ్ల నిండిన యువతీ యువకుల పేర్లు ఓటరు జాబితాలో ఉండేలా చూడాలన్నారు. తహసీల్దార్ వెంకటరమణ, డీటీ తెలంగ్‌రావు, ఎంపీవో రామకృష్ణ పాల్గొన్నారు.

'నాఫెడ్' సమావేశానికి చైర్మన్లు



సుభాష్‌నగర్: ఢిల్లీలోని శుక్రవారం జరిగిన జాతీయ అగ్రికల్చర్ కో ఆపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (నాఫెడ్) సర్వసభ్య సమావేశానికి రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డితో కలిసి ఐడీసీఎంఎస్ చైర్మన్ బాదావత్ తారాచంద్ నాయక్ హాజరయ్యారు. ఈసందర్భంగా రాష్ట్రంతో పాటు ఉమ్మడి జిల్లాలో రైతుల ఆదాయం రెట్టింపు చేయడానికి అవసరమైన సలహాలు, సూచనలు చేశారు.

ఎంఈవోకు మెమో

నిజామాబాద్‌అర్బన్: యూనియన్ ఎన్నికల్లో ప్రచారం చేశారనే కారణంతో రుద్రూరు ఎంఈవో నాగనాథ్‌కు డీఈవో దుర్గాప్రసాద్ శుక్రవారం మెమో జారీ చేశారు. యూనియన్ ఎన్నికల్లో ఎంఈవో ప్రచారం చేస్తున్న తీరుపై 'సాక్షి'లో కథనం ప్రచురితం కావడంతో డీఈవో స్పందించారు. ఇదిలా ఉండగా, ఎంఈవోకు మెమో జారీ చేయొద్దంటూ ప్రధాన సంఘం నాయకుడు జిల్లా విద్యాశాఖ అధికారిపై ఒత్తిడి తీసుకువచ్చారు. సుమారు రెండు గంటలపాటు డీఈవోతో వాగ్వాదానికి దిగినట్లు తెలిసింది. ఎంఈవో వివరణ ఇచ్చిన తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటామని డీఈవో అన్నారు.

నేడు ఒంటిపూట బడులు

నిజామాబాద్ అర్బన్: జిల్లాలోని పాఠశాలలకు శనివారం ఒంటిపూట బడి నిర్వహిస్తున్నట్లు డీఈవో దుర్గాప్రసాద్ తెలిపారు. ఇటీవల వర్షాల సమయంలో బడులకు సెలవులు ఇచ్చిన నేపథ్యంలో రెండో శనివారం పనిదినంగా పాటించాలని శుక్రవారం ఉదయం ఆదేశాలు జారీ చేశారు. కాగా ప్రధాన సంఘం ఎన్నికలు ఉండడంతో డీఈవోపై ఒత్తిడి తెచ్చినట్లు సమాచారం. దీంతో ఒంటి పూట కొనసాగించాలని డీఈవో ఆదేశాలు జారీ చేశారు. మిగతా జిల్లాల్లో అన్ని పాఠశాలలు పూర్తిస్థాయిలో కొనసాగిస్తున్నారు.

అవుట్ సోర్సింగ్‌కు అందలం!

- నిబంధనలకు విరుద్ధంగా కార్పొరేషన్ అధికారుల తీరు
- ముఖ్యమైన విభాగాల్లో భారీగా అవినీతి
- ఇష్టారాజ్యంగా ట్రేడ్ లైసెన్సుల జారీ



నిజామాబాద్ అర్బన్: నిజామాబాద్ కార్పొరేషన్‌లో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నా రు. నిబంధనలకు విరుద్ధంగా అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి అధికారాలు కట్టబెట్టారు. దీంతో ఆయా విభాగాల్లో అనేక అక్రమాలు, అవినీతి చోటు చేసుకుంటున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యమైన విభాగాల్లోనూ కనీసం సంతకం చేసే అర్హత లేని వారికి ఈ బాధ్యతలు అప్పగించడం అనేక విమర్శలకు దారితీస్తుంది. మున్సిపల్ కమిషనర్ కొన్ని రోజుల క్రితం శానిటేషన్ విభాగంలో ఒకే చోట కొన్నేళ్లుగా పనిచేస్తున్న వారికి బదిలీలు చేశారు. ఇందులో శానిటేషన్ విభాగంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను అందలం ఎక్కించారు. అవుట్ సోర్సింగ్ విభాగంలో పనిచేస్తున్న నలుగురు ఉద్యోగులకు శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ బాధ్యతలు అప్పగించారు. వీరు రెగ్యులర్ ఉద్యోగులు కాకపోవడంతో ముఖ్యమైన విధుల నిర్వహణలో సంతకాలు చేయడానికి అనర్హులు. ప్రస్తుతం ట్రేడ్ లైసెన్సుల జారీ, వాహనాలకు డీజిల్ కూపన్‌లు కేటాయించడం, కూపన్లపై సంతకాలు చేయడం ముఖ్యమైన విధులు. వీటిపై సంతకాలు చేయడాని వీరికి అర్హత లేదు. కానీ ప్రస్తుతం మున్సిపాలిటీలో ఇదే అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ట్రేడ్ లైసెన్సులు జారీ చేయడం, డీజిల్ కూపన్లపై సంతకాలు చేస్తున్నారు. ఈ వ్యవహారంలో అవినీతి, పొరపాట్లు జరిగినా అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఎలాంటి బాధ్యత ఉండదు. కానీ అధికారులు మాత్రం వీరికి బాధ్యతలను అప్పజెప్పారు.

హాజరు కాకున్నా అటెండెన్స్

కార్మికుల హాజరు పరిశీలించే బాధ్యత శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లకు ఉంటుంది. అయితే వీరు కార్మికులు విధులకు రాకున్నా హాజరు వేసి వారి నుంచి డబ్బులు దండుకుంటున్నారని ఆరోపణలు ఉన్నాయి. అంతేగాక జోన్ల వారీగా వర్కర్ల కేటాయింపులోనూ అక్రమాలకు పాల్పడుతున్నారు. ముఖ్యంగా ట్రేడ్ లైసెన్సులకు నిబంధనలు పరిశీలించకుండానే వీరు అనుమతులు జారీ చేస్తున్నారు. అంతేగాక కార్పొరేషన్‌కు రావాల్సిన పన్నులను తగ్గించి ఇస్తున్నారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ముఖ్యమైన విభాగాలను కేటాయించడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. ఓ అధికారి అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులతో కుమ్మక్కై వారికి ముఖ్యమైన విభాగాలను కేటాయించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం మున్సిపల్ కార్యాలయంలో హెల్త్ సూపర్‌వైజర్లుగా నలుగురిని కేటాయించారు. వీరందరూ కూడా అవుట్‌సోర్సింగ్ విభాగంలో పనిచేస్తున్న వారే. ఇందులో కొందరు ఫేక్ సర్టిఫికెట్లతో ఉద్యోగం చేస్తున్నట్లు సమాచారం.

అవినీతి ఆరోపణలు

మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న కొందరు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులపై అనేక అవినీతి ఆరోపణలు వస్తున్నాయి. ఓ హెల్త్ అసిస్టెంట్ ఆదర్శనగర్‌లో రూ.కోట్ల విలువ చేసే ఇంటిని నిర్మించాడు. మరో హెల్త్ అసిస్టెంట్ ఆర్మూర్ రోడ్డులోని ఖరీదైన ఇంటిని నిర్మిస్తున్నాడు. వీరికి పలు వ్యాపార సముదాయాల్లో భాగస్వామ్యం కూడా ఉంది. వీరు ట్రేడ్ లైసెన్సుల జారీలో నిత్యం రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు వసూలు చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. అలాగే హాజరు శాతం నమోదు చేయడానికి కార్మికుల వద్ద నుంచి డబ్బులు అడుగుతున్న ట్లు తెలిసింది. వీటిపై అధికారులు దృష్టి సారించడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. గతంలో ఓ ఉద్యోగి ట్రేడ్ లైసెన్స్‌ల కోసం వ్యాపార సముదాయాల వద్దకు వెళ్లి వసూలు చేశాడు. దీనిపై నాటి కమిషనర్ చిత్రామిశ్రా విచారణ జరిపి చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం మళ్లీ అతనికే బాధ్యతలు అప్పజెప్పడంపై విమర్శలు వస్తున్నాయి.

సంతకాలు చేసే అధికారం ఉండదు



శానిటేషన్ విభాగంలో ఇన్‌స్పెక్టర్లుగా అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను నియమించాం. వీరు సపోర్టింగ్ స్టాఫ్‌గా మాత్రమే పనిచేస్తారు. తుది బాధ్యత సంబంధిత ఉన్నతాధికారులదే. ఏమైనా ఘటనలు జరిగితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. – మకరందు, మున్సిపల్ కమిషనర్

ధాన్యం కొనుగోళ్లకు ప్రణాళిక

- 8 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ లక్ష్యం
- 480 కొనుగోలు కేంద్రాలకు ప్రతిపాదనలు
- 2 కోట్ల గన్నీ బ్యాగులు అవసరమని అంచనా
- దసరా తర్వాత కేంద్రాల ప్రారంభానికి సన్నాహాలు



సుభాష్‌నగర్ : వానాకాలం ధాన్యం సేకరణకు అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో జిల్లా పౌరసరఫరాశాఖ, కార్పొరేషన్, ఇతరత్ర శాఖల అధికారులు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశారు. సుమారు 8 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రాథమిక సహకార సంఘాలు, మెప్మా, ఐకేపీ, డీసీఎంఎస్, తదితర సంస్థలు ఆధ్వర్యంలో 480 కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరించనున్నారు. ఇందుకోసం 2 కోట్ల గన్నీ బ్యాగులు అవసరం అవుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ధాన్యం రవాణా కోసం టెండర్ల ప్రక్రియ చివరి దశకు చేరుకుంది. నేడో, రేపో టెండర్లు ఖరారు కానున్నాయి. కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లలో పౌరసరఫరాలశాఖ నిమగ్నమైంది. దసరా తర్వాత కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

చివరిదశకు ట్రాన్స్‌పోర్ట్ టెండర్ ప్రక్రియ

సేకరించిన ధాన్యాన్ని రైస్‌మిల్లులకు తరలించేందుకు ట్రాన్స్‌పోర్ట్ టెండర్ ప్రక్రియ చివరి దశకు చేరుకుంది. నేడో, రేపో ఫైనల్ చేయనున్నారు. 10 సెక్టార్లుగా విభజించి టెండర్ ప్రక్రియను చేపట్టారు. అలాగే ధాన్యం సేకరించేందుకు 2 కోట్ల గన్నీ బ్యాగులు అవసరం అవుతాయని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే 76 లక్షలకుపైన గన్నీ బ్యాగులు అందుబాటులో ఉండగా, మరో కోటి 24లక్షల బ్యాగుల కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించారు. సేకరించిన ధాన్యాన్ని 227 రైస్‌మిల్లులకు కేటాయించాలని అధికారులు నిర్ణయించినట్లు తెలిసింది.

4.30 లక్షల ఎకరాల్లో వరిసాగు

జిల్లావ్యాప్తంగా 4.30లక్షల ఎకరాల్లో వరి సాగుచేశారు. అందులో 3.67 లక్షల ఎకరాల్లో సన్నరకాలు, మిగతా 63వేల ఎకరాల్లో ఇతర రకాలు సాగైంది. మొత్తం 11.95 లక్షల మెట్రిక్ టన్నుల పంట దిగుబడి రానుండగా, కేంద్రాల ద్వారా 8 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో ఏడు లక్షల మెట్రిక్ టన్నులు సన్నరకం మరో లక్ష మెట్రిక్ టన్నులు ఇతర రకాలు ఉంటాయని అధికారులు అంచనా వేస్తున్నారు. మరో 15 నుంచి 20 రోజుల్లో జిల్లాలోని వర్ని, రుద్రూర్, మోస్రా, చందూర్‌తోపాటు పలు మండలాల్లో పంట కోతలు షురూ కానున్నాయి. ధాన్యం సేకరణపై ఈనెలాఖరున జిల్లా ఉన్నతాధికారులు సమన్వయ సమావేశాన్ని ఏర్పాటు చేయనున్నారు.

ఇబ్బందులు లేకుండా సేకరిస్తాం



వానాకాలం సీజన్ ధాన్యం సేకరణకు ఏర్పాట్లు చేస్తున్నాం. కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నాం. ముఖ్యంగా ధాన్యం రవాణాకు సంబంధించి గత ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ముందుకెళ్తున్నాం.

– వైపీ రమేశ్, జిల్లా మేనేజర్, పౌరసరఫరాల సంస్థ

రక్త పరీక్షలకు బ్రేక్!

- టీ హబ్‌లో సర్వర్ డౌన్‌తో ప్రభుత్వ ఆస్పత్రుల్లో నిలిచిన సేవలు
- మూడు రోజులుగా ఇబ్బందులు పడుతున్న రోగులు

నిజామాబాద్ నాగారం: జిల్లాలో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. ప్రజలు రోగాల బారిన పడి అల్లాడిపోతున్నారు. ఆయా వ్యాధులతో బాధపడుతున్న వారు ప్రభుత్వ ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. అయితే ప్రభుత్వ ఆస్పత్రుల్లో రక్త పరీక్షల రిపోర్టులు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. టీ హబ్‌లో సర్వర్ సమస్య ఉండటంతో మూడు రోజులుగా జిల్లాలోని ఆయా ఆస్పత్రుల్లో రక్త పరీక్షలు నిలిచిపోయాయి. జిల్లాలో 28 పీహెచ్‌సీలు, 8 కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, 10 అర్బన్ హెల్త్ సెంటర్లు, బోధన్, ఆర్మూర్‌లో ఏరియా ఆస్పత్రులు ఉన్నాయి. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్) ఉంది. విషజ్వరాలతో పీహెచ్‌సీలో, సీహెచ్‌సీల పరిధిలో నిత్యం 100కు పైగా ఓపీ వస్తుంది. ఆర్మూర్, బోధన్ ఆస్పత్రులకు 600 నుంచి 800లకు పైగా రోగులు వస్తున్నారు. ఇక జీజీహెచ్ గురించి వేరే చెపనక్కర్లేదు. నిత్యం రెండు వేలకు పైగా ఓపీ నమోదు అవుతుంది.

రిపోర్టులు రావడం లేదని..

ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులను వైద్యులు చూసి అవసరమైన రక్త పరీక్షలు చేయించుకోవాలని చెబుతున్నారు. అయితే రక్త పరీక్షలకు వెళ్తే రిపోర్టులు రావడం లేదని, పరీక్షలు చేయలేమని సిబ్బంది చెబుతున్నారు. మందులు తీసుకోవాలని ఉచిత సలహా ఇస్తున్నారని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టీ హబ్‌లో సర్వర్ డౌన్ ఉందని మూడు రోజులుగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో సిబ్బంది రక్త పరీక్షలు చేయడం లేదు. రోగులకు మందులు ఇచ్చి ఇంటికి పంపిస్తున్నారు. కిట్‌లు ఉండడంతో డెంగీ పరీక్షలు చేస్తున్నారు. దీంతో చాలా మంది రోగులు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్తున్నారు.



జీజీహెచ్‌లోని టీ హబ్

వివరాలు గోప్యం

జిల్లా కేంద్రంలోని జీజీహెచ్ ఆవరణలో ఉన్న టీ-హబ్‌లో సర్వర్ డౌన్ ఉంది. కొన్ని పరీక్షలు మాత్రం మాన్యువల్ చేస్తున్నారు. మూడు రోజులుగా సర్వర్‌డౌన్ ఉన్నా విషయాన్ని టీ హబ్ ఇన్‌చార్జి దివ్య గోప్యంగా ఉంచుతున్నారు. రిపోర్టులు వస్తున్నాయని, రక్త పరీక్షలు చేస్తున్నామని చెబుతున్నారు. వారం రోజులుగా నిత్యం ఎన్ని పరీక్షల రిపోర్టులు ఇచ్చారని సమాచారం అడిగితే మాత్రం మూడు రోజులుగా సర్వర్ డౌన్ ఉందని చెబుతున్నారు. ఇదే విషయమై వివరణ కోరేందుకు జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రతిమారాజ్‌కు ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదు.

పల్లె ఓటర్లు @ 8,29,463

- వార్డుల వారీగా ముసాయిదా జాబితా విడుదల
- ఈ నెల 21 వరకు అభ్యంతరాల స్వీకరణ
- 28న ఓటరు తుది జాబితా



మోపాల్‌లో వార్డుల వారీగా ముసాయిదా ఓటరు జాబితా ప్రదర్శిస్తున్న సిబ్బంది

సుభాష్‌నగర్: రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం గ్రామపంచాయతీల్లో వార్డులవారీగా ముసాయిదా జాబితా శుక్రవారం విడుదలైంది. మొత్తం 5,020 వార్డు స్థానాల్లో 8,29,463 మంది పల్లె ఓటర్లు ఉన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల ఓటరు జాబితా ఆధారంగా వార్డులవారీగా ఓటరు జాబితా సిద్ధం చేయాలని గతనెల 21న రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈమేరకు గ్రామపంచాయతీల్లో కార్యదర్శులు, బీఎల్‌ఓలు, సిబ్బంది టీ పోల్ యాప్‌లో జాబితాను కసరత్తు చేశారు. ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పకడ్బందీగా జాబితాను రూపొందించారు. ఓటరు ముసాయిదా జాబితాపై ఈనెల 14 నుంచి 21 వరకు అభ్యంతరాలను స్వీకరించనున్నారు. సెప్టెంబర్ 28న తుది ఓటరు జాబితా విడుదల కానుంది.

అత్యధికంగా నందిపేట్‌లో..

జిల్లాలో 27 మండలాలు, 545 గ్రామపంచాయతీలు ఉన్నాయి. ఆయా గ్రామ పంచాయతీల్లో 5,020 వార్డుస్థానాలు ఉండగా, ముసాయిదా జాబితా ప్రకారం 8,29,463 మంది ఓటర్లు ఉన్నారు. అందులో 3,86,493 మంది పురుషులు ఉండగా, 4,42,955 మహిళా ఓటర్లు, 15 ఇతరులు ఉన్నారు. కాగా జిల్లాలో మొత్తం 29 మండలాలు ఉండగా, నిజామాబాద్ ఉత్తర, దక్షిణ మండలాలు కార్పొరేషన్ పరిధిలో ఉన్నాయి. అత్యధికంగా నందిపేట్ మండలంలో 57,085 మంది ఓటర్లు, చందూర్‌లో అత్యల్పంగా 8,723 మంది ఉన్నారు.

అభ్యంతరాలు పరిష్కరించాక..

ఓటరు ముసాయిదా జాబితాలో ఏమైనా అభ్యంతరాలుంటే సెప్టెంబర్ 14 నుంచి 21 వరకు గ్రామ పంచాయతీల్లో, మండల కార్యాలయంలో అభ్యంతరాలు స్వీకరిస్తారు. అభ్యంతరాలను ఈనెల 26 వరకు డీపీవో పరిశీలించి పరిష్కరిస్తారు. అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని జాబితాను క్షుణ్ణంగా పరిశీలించనున్నారు. ఈనెల 28వ తేదీన పల్లె ఓటర్లు తుది జాబితా విడుదల చేయనున్నారు.

ముసాయిదా ఓటరు జాబితా మండలాల వారీగా ..

మండలం	ఓటర్లు	కమ్మర్‌పల్లి	29,277	నిజామాబాద్ రూరల్	21,223
ఆర్మూర్	43,483	కోటగిరి	39,935	రెంజల్	29,112
బాల్కొండ	25,191	మాక్లూర్	40,213	రుద్రూర్	17,073
భీమ్‌గల్	38,189	మెండోరా	20,623		
బోధన్	47,831	మోర్తాడ్	26,937	సిరికొండ	33,260
చందూరు	8,723	మోస్రా	10,235	వేల్పూర్	36,568
ధర్పల్లి	31,293	మోపాల్	29,935	వర్ని	26,550
డిచ్‌పల్లి	45,386	ముప్కాల్	15,906	ఎడపల్లి	30,949
ఇందల్వాయి	30,074	నందిపేట్	57,085	ఏర్గట్ల	14,183
జక్రాన్‌పల్లి	34,326	నవీపేట్	45,903	మొత్తం	8,29,463

నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

- డీపీవో తరుణ్‌కుమార్

నందిపేట్(ఆర్మూర్): నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాల నిమజ్జనత్సోవానికి పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి తరుణ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం నందిపేటలోని ఉమ్మెడ గోదావరి పరివాహక ప్రాంతాన్ని, నిమజ్జనం జరిగే బ్రిడ్జి ప్రాంతాలను ఆయన పరిశీలించారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ఎనిమిది అడుగులకు పైబడి ఎత్తున్న విగ్రహాలను నందిపేట మండలం ఉమ్మెడ గోదావరి బ్రిడ్జి వద్ద నిమజ్జనానికి ఏర్పాటు చేస్తున్నారు. దీంతో భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా అధికారులు చర్యలు చేపడుతున్నారు. రోడ్లకు ఇరువైపులా ఉన్న చెట్లను తొలగిస్తున్నారు. తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలను పైకి బిగించేలా చర్యలు తీసుకుంటున్నారు. భారీ విగ్రహాల నిమ జ్జనం కోసం మూడు క్రేన్లను అందుబాటులో ఉంచుతున్నట్లు డీపీవో తెలిపారు. తగిన లైటింగ్ సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీవో శివకృష్ణ, తహసీల్దార్ ఆనంద్‌కుమార్, ఎంపీడీవో శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ శాఖ డీఈ కిషన్, ఎంపీవో లక్ష్మిప్రసాద్ పాల్గొన్నారు.



ఉమ్మెడ గోదావరి బ్రిడ్జి వద్ద నిమజ్జన స్థలాన్ని పరిశీలిస్తున్న డీపీవో తరుణ్‌కుమార్

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అంకిత్

నిజామాబాద్ అర్బన్: మహిళా సంఘాల సభ్యులు రుణాలను సద్వినియోగం చేసుకోని, ఆర్థికంగా అభివృద్ధి చెందాలని అదనపు కలెక్టర్ అంకిత్ అన్నారు. కొత్తగా గుర్తించిన జీవనోపాధుల గురించి శుక్రవారం అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. సంఘాల్లో బుక్ కీపింగ్, మీటింగ్ నిర్వహణ పారదర్శకంగా జరగాలన్నారు. జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరం 150 మంది మహిళలతో వ్యాపార, పరిశ్రమ, సేవల రంగంలో 150 యూనిట్లు ఏర్పాటు చేయించాలని మెప్మా స్టేట్ మిషన్ కో ఆర్డినేటర్ పద్మ సూచించారు. మెప్మా సంచాలకులు రాజేందర్ మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యులు పొందిన రుణాలను యూనిట్‌గా మార్చితే ఆర్థికంగా ఎదుగుతారన్నారు. ఎస్‌ఐడీబీఐ అధికారులు మాట్లాడుతూ.. మైక్రో ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ పథకానికి ఈ సంవత్సరం పైలట్ ప్రాజెక్ట్‌గా నిజామాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాలను ఎంపిక చేసిందని తెలిపారు. ఇందులో భాగంగా సీఆర్‌పీలకు అవగాహన కల్పించినట్లు తెలిపారు.

'కేసీఆర్ డైరెక్షన్‌లో కౌశిక్ వ్యాఖ్యలు'

ఖలీల్‌వాడి: సెటిలర్లపై ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి మాజీ సీఎం కేసీఆర్ డైరెక్షన్‌లో వ్యాఖ్యలు చేస్తున్నారని డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ భవన్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల్లో సెటిలర్లను మభ్యపెట్టి ఓట్లు వేయించుకున్నారని, ఇప్పుడు కేసీఆర్ సూచనలు మేరకు కేటీఆర్ ఆధ్వర్యంలో తెలంగాణలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అల్లర్లు సృష్టించేందుకు ప్రయత్నించిన ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిని బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేయాలన్నారు. సెటిలర్లపై జిల్లాకు చెందిన ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి తన వైఖరి స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.

15న మహేశ్‌గౌడ్ ప్రమాణస్వీకారం

పీసీసీ అధ్యక్షుడిగా జిల్లాకు చెందిన మహేశ్‌కుమార్‌గౌడ్ గాంధీభవన్‌లో ఆదివారం బాధ్యతలు స్వీకరిస్తారని మోహన్‌రెడ్డి తెలిపారు. కార్యకర్త స్థాయి నుంచి ఎదిగిన మహేశ్‌ను పీసీసీ అధ్యక్షుడిని చేసినందుకు పార్టీ అధినాయకత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, సీనియర్ నాయకుడు గడుగు గంగాధర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, చిత్రంలో తాహెర్, గడుగు

క్లుప్తంగా

మనుబోతును చంపిన వ్యక్తి రిమాండ్‌

సిరికొండ: మండలంలోని రావుట్ల అటవీ ప్రాంతంలో మనుబోతు(నీల్‌గాయ్‌)ను చంపిన ఓ వ్యక్తిని అరెస్ట్‌ చేసి శుక్రవారం కోర్టులో రిమాండ్‌ చేసినట్లు ఇన్‌చార్జి ఎఫ్‌ఆర్వో రవీందర్‌ పేర్కొన్నారు. కంపార్ట్‌మెంట్‌ నంబర్‌ 396 అటవీ ప్రాంతంలో జంగిలోడి తండాకు చెందిన కొందరు వ్యక్తులు నీల్‌గాయిని చంపి పాళ్లు వేసుకొని తీసుకెళ్తున్నపుడు పట్టుకున్నట్లు తెలిపారు. వారిలో కొందరు పారిపోగా బనావత్‌ రాజును పట్టుబడ్డాడని అన్నారు. త్వరలో మిగతా వారిని అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలిస్తామన్నారు. అటవీ జంతువులను వేటాడితే వన్యప్రాణుల చట్టం ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. డీఆర్వో గంగారాం, రావుట్ల సెక్షన్‌ అధికారి కృష్ణగీత్‌ ఉన్నారు.

నిందితుడికి పది నెలల జైలు

ఖలీల్‌వాడి: దొంగతనం కేసులో ఓ నిందితుడికి పది నెలల జైలు శిక్షను విధిస్తూ రెండవ జ్యుడిషియల్‌ ఫస్ట్‌క్లాస్‌ మెజిస్ట్రేట్‌ శ్రీనివాస్‌రావు శుక్రవారం తీర్పు వెల్లడించారు. వివరాలిలా ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని గంగస్థాన్‌-2లో నివాసం ఉంటున్న రంగప్ప గారి శంకర్‌ మార్చి 3న పనినిమిత్తం ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌కు వెళ్లాడు. ఇంటికి తాళం ఉండటాన్ని గమనించిన దుండగులు చోరీకి పాల్పడ్డారు. దీంతో బాధిత కుటుంబీకులు రూరల్‌ పీఎస్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. మే7న నిజామాబాద్‌ బైపాస్‌ చౌరస్తాలో వాహనాల తనిఖీ చేపడుతున్న సమయంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న డిచ్‌పల్లి మండలం నడిపల్లికి చెందిన రుద్రబోయిన గణేశ్‌ను పోలీసులు పట్టుకుని విచారించారు. నిందితుడి విచారణలో గంగస్థాన్‌-2లో చోరీకి పాల్పడినట్లు అంగీకరించాడు. దీంతో అతని నుంచి ఆరు తులాల బంగారం, వెండి ఆభరణాలు రికవరీ చేసి రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం కోర్టులో సాక్షుల విచారణ అనంతరం నిందితుడు నేరం చేసినట్లు రుజువు కావడంతో జడ్జి శుక్రవారం పది నెలల జైలు శిక్ష విధించారు. కేసులో ఇన్వెస్టిగేషన్‌ చేసిన ఎస్సై జి లింబాద్రి, కోర్టు విచారణలో పీపీ రాజేశ్‌గౌడ్‌, కోర్ట్‌ కానిస్టేబుల్‌ లక్ష్మణ్‌ నిందితుడికి శిక్ష పడడంలో కీలకంగా వ్యవహరించారు.

డ్రంకన్‌ డ్రైవ్‌లో సామాజిక సేవ చేయాలని తీర్పు

ఖలీల్‌వాడి: డ్రంకన్‌ డ్రైవ్‌లో పట్టుబడిన ఇద్దరిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చగా జడ్జి ఒకరోజు సామాజిక సేవ చేయాలని తీర్పు వెల్లడించినట్లు ఎస్‌హెచ్‌వోలు విజయ్‌బాబు, వెంకట్రావు శుక్రవారం పేర్కొన్నారు. వివరాలిలా ఉన్నాయి. నగరంలోని ఆరోటౌన్‌ పీఎస్‌లో పరిధిలో డ్రంకన్‌ డ్రైవ్‌ తనిఖీలు చేపడుతుండగా శామీర్‌పేట్‌ మండలం పొన్నల్‌ గ్రామానికి చెందిన బత్తిని నవీన్‌కుమార్‌, ఒకటో టౌన్‌ పీఎస్‌ పరిధిలో మాక్లూర్‌ మండలం గొట్టిముక్కల గ్రామానికి చెందిన నర్సయ్య మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించారు. వెంటనే వారిని పరీక్షించగా మద్యం సేవించినట్లు నిర్ధారణ అయింది. వీరిని కోర్టులో హాజరుపర్చగా స్పెషల్‌ జ్యుడీషియల్‌-2 మెజిస్ట్రేట్‌ అజ్మీరా సాకేత్‌కుమార్‌ నూతన క్రిమినల్‌ చట్టాలను అనుసరించి ఒకరోజు సామాజిక సేవ చేయాలని తీర్పు వెల్లడించారు. డిచ్‌పల్లిలో ఉన్న మానవతా సదన్‌లో వీరు ఒకరోజు సామాజిక సేవ చేస్తారని పేర్కొన్నారు.

పోక్సో కేసు నమోదు

ఖలీల్‌వాడి: నగరంలోని ఐదో టౌన్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని నాగారాంలో బాలికపై అత్యాచార యత్నం చేసిన వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై గంగాధర్‌ శుక్రవారం తెలిపారు. ఇంట్లో టీవీ చూస్తున్న బాలికను మభ్యపెట్టి గదిలోకి తీసుకు వెళ్తుండగా గమనించిన తల్లి కొట్టడంతో అక్కడి నుంచి పరారయ్యాడని చెప్పారు. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

విద్యుత్‌తో జర భద్రం

- లేకుంటే ప్రాణాలకే ప్రమాదం
- గణేశ్‌ మండపాల్లో జాగ్రత్తలు తప్పనిసరి



ఖలీల్‌వాడి: గణేశ్‌ నవరాత్రి ఉత్సవాల్లో విద్యుత్‌ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. లేదంటే ప్రాణాలకే ప్రమాదం. గణేశ్‌ నవరాత్రి ఉత్సవాలు చిన్నా, పెద్ద అనే తేడా లేకుండా నిర్వహిస్తారు. ఈ క్రమంలో అక్కడక్కడ కొన్ని అపశ్రుతులు చోటు చేసుకుంటున్నాయి. కొందరు విద్యుత్‌షాక్‌తో గాయాలకు గురికాగా మరికొందరు ప్రాణాలు కోల్పోతున్నారు. ఉత్సవాలు ముగిసే వరకు నిర్వాహకులను సంబంధిత అధికారులు సమన్వయం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

గణేశ్‌ మండపాలు అందంగా అలంకరించేందుకు మండలి నిర్వాహకులు తాత్కాలికంగా విద్యుత్‌ కనెక్షన్‌లను ఏర్పాటు చేస్తారు. వీటిని కర్రల సహాయంతో స్విచ్‌ బోర్డులు ఏర్పాటు చేస్తారు. దీంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అదే స్థానిక లైన్‌మన్‌ సహకారంతో విద్యుత్‌ వైర్లను ఏర్పాటు చేస్తే ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉండదు. విద్యుత్‌ విషయంలో నిమజ్జనం అయ్యే వరకు మండపాల నిర్వాహకులు జాగ్రత్తలు పాటించాలి. లేకుంటే ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉంటుంది. మండపాల్లో ఏదైనా విద్యుత్‌ ప్రమాదం సంభవిస్తే వెంటనే టోల్‌ ఫ్రీ నంబర్‌-1912 లేదా స్థానిక లైన్‌మన్‌, ఏఈ, విద్యుత్‌ శాఖ అధికారులకు సమాచారం అందించాలి.

జిల్లాలో వినాయక విగ్రహాలను 6 నుంచి 30 అడుగుల వరకు గణేశ్‌ విగ్రహాలను ఏర్పాటు చేశారు. మండలి నిర్వాహకులు గణేశ్‌ ప్రతిమకు అనుకూలంగా మండపాలను ఏర్పాటు చేశారు. ఇటీవల కురిసిన ఈదురుగాలులకు, వర్షాలకు పైకప్పులు, కవర్లు ఊడిపోయాయి. ఇలాంటి సమయంలో విద్యుత్‌ వైర్ల దగ్గర చాలా జాగ్రత్త చర్యలు పాటించాలి.

నాలుగు రోజుల క్రితం సిరికొండ మండలం గోప్యతండాలో ఏర్పాటు చేసిన గణేశ్‌ మండపంలో సౌండ్‌ బాక్స్‌లు సెట్‌ చేస్తున్న సమయంలో భూక్య సంజీవ్‌(17) కరెంట్‌ షాక్‌తో మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు. ఇలా పలు గణేశ్‌ మండపాల్లో విద్యుత్‌షాక్‌ గురై గాయాలైన ఘటనలు ఉన్నాయి. ఇలాంటి ప్రమాదాలు జరగకుండా ఉండాలంటే నిర్వాహకులు జాగ్రత్తలు పాటించాలి.

పెరిగిన మండపాలు

జిల్లా వ్యాప్తంగా గతేడాది కంటే ఈ సారి 20 శాతం ఎక్కువ మంది గణేశ్‌ ప్రతిమలను ఏర్పాటు చేశారు. గణేశ్‌ మండపాలపై పోలీసు శాఖ దృష్టి సారించింది. నిర్వాహకుల సమాచార సేకరణతో పాటు గూగుల్‌ ద్వారా విగ్రహ ప్రాంతాన్ని సైతం పూర్తి సమాచారం ఇందులో ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే వెంటనే సమాచారం అందించేందుకు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు.

జాగ్రత్తలు పాటించాలి

గణేశ్‌ నిమజ్జనం కోసం ట్రాక్టర్లు, డీసీఎంలు, ట్రాలీ ఆటోలను వినియోగిస్తారు. ఈ సమయంలో వాహనాల్లో ఉంచిన గణేశ్‌ విగ్రహాలు విద్యుత్‌ వైర్లకు తగలకుండా జాగ్రత్తలు పాటించాలి. వెదురుబొంగు కర్రలతో విద్యుత్‌ తీగలను తాకకుండా చూడాలి. ఇటీవల కురుస్తున్న వర్షాలతో చెరువులు, వాగులు ఉన్న ప్రాంతాలు మట్టితో జారుతుంటాయి. గణేశ్‌ ప్రతిమలను చెరువుల్లో దించుతున్న సమయంలో అందరూ నెమ్మదిగా వెళ్తూ నిమజ్జనం చేయాలి. నీటిలో దిగేముందు జాగ్రత్తలు పాటించాలి.

ఆపన్నహస్తం కోసం ఎదురుచూపులు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శోభన్‌

సిరికొండ: నరాలు దెబ్బతిని తలలో రక్తం గడ్డ కట్టి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు ఓ అభాగ్యుడు. చికిత్స కోసం చేతిలో చిల్లిగవ్వ లేక దీనావస్థలో ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్నారు. ఇప్పటి వరకు కుటుంబ సభ్యులు రూ. లక్షన్నర వరకు అప్పు చేసి చికిత్స చేయిస్తున్నారు. మరో రూ. పది లక్షల వరకు ఖర్చు చేస్తే గాని ఆరోగ్యం మెరుగుపడదని డాక్టర్లు చెప్పడంతో దిక్కు తోచని స్థితిలో అల్లాడుతున్నారు బాధిత కుటుంబీకులు. గడ్కోల్‌కు చెందిన కట్ట శోభన్‌ పేద కుటుంబానికి చెందిన యువకుడు. అతడికి భార్య జ్యోతి, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబం వారిది. ఉపాధి కోసం చాలా ఏళ్లు గల్ఫ్‌కు వలస వెళ్లాడు. సరైన ఉపాధి లభించక ఇంటికి తిరిగి వచ్చి కూలీ నాలి చేసుకుంటు జీవనం సాగిస్తున్నారు. ఇంతలోనే వారం రోజుల క్రితం శోభన్‌ ఒక్కసారిగా అనారోగ్యానికి గురయ్యాడు. చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం తలలో నరాలు దెబ్బతిని రక్తం గడ్డ కట్టిందని వైద్యులు తెలిపారు. శస్త్ర చికిత్స చేయాలని, చికిత్స కోసం రూ. పది లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. చేతిలో చిల్లగవ్వ లేక ఏం చేయాలో తెలియక అల్లాడుతోంది ఆ పేద కుటుంబం. ఇప్పటి వరకు రూ. లక్షన్నర వరకు అప్పులు చేసి ఇప్పటి వరకు చికిత్స చేయిస్తున్నారు. శస్త్ర చికిత్స కోసం డబ్బులు లేకపోవడంతో ఎవరైన ఆపన్నహస్తం అందిస్తే బాగుండు అని వేడుకుంటున్నారు. పెద్ద మనసుతో దాతలు తగిన సహాయం అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. సహాయం చేసే వారు 7981111747 నెంబర్‌కు ఫోన్‌ పే చేయగలరని విన్నవిస్తున్నారు. వీలయిన వారు నేరుగా కూడా సహాయం అందించాలని వేడుకుంటున్నారు.

గణేశ్‌ మండలి ఆధ్వర్యంలో రక్తదానం



రక్తదానం చేస్తున్న యువకులు

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్‌): జిల్లాలో రక్తం నిల్వల కొతర ఉందని, గణేశ్‌ మండపాల వద్ద అన్నదానాలతోపాటు యువత రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయాలని జిల్లా రెడ్‌క్రాస్‌ సొసైటీ చైర్మన్‌ బుస్సా ఆంజనేయులు ఇటీవల పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. స్పందించిన డిచ్‌పల్లి మండలం ఘన్‌పూర్‌ గ్రామంలోని యువసేన యూత్‌ గణేశ్‌ మండలి సభ్యులు శుక్రవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. రెడ్‌క్రాస్‌ సొసైటీ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో సుమారు 20 మంది యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ.. తమ పిలుపు మేరకు స్పందించి జిల్లాలోనే మొదటిసారి ఘన్‌పూర్‌ యువత గణేశ్‌ మండలి వద్ద రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. యువసేన యూత్‌ సభ్యులను ఆదర్శంగా తీసుకుని జిల్లాలోని ఇతర ప్రాంతాల్లోని యువకులు రక్తదానం చేయాలని కోరారు. రక్తదానం చేసిన వారిలో యువకులు వాసరి సాయినాథ్‌, చౌకి హరీష్‌, కృష్ణతేజ, ఏ.మహేష్‌, కర్ని రమణ, ఆర్‌ దిలీప్‌, ప్రశాంత్‌గౌడ్‌, రవి, అజయ్‌, విజయ్‌, నరేశ్‌, చౌకి వెంకటేశ్‌, యువసేన యూత్‌ సభ్యులున్నారు. కార్యక్రమంలో డాక్టర్‌ రాజేశ్‌, రెడ్‌క్రాస్‌ బ్లడ్‌బ్యాంక్‌ సిబ్బంది పోతన్న, గంగాధర్‌, ఇస్మాయిల్‌, వీడీసీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం యువసేన యూత్‌, రామ్‌సేన సంయుక్త ఆధ్వర్యంలో గణేశ్‌ మండపం వద్ద అన్నదానం చేశారు.

లోక్‌ అదాలత్‌ను వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న న్యాయమూర్తులు

బోధన్‌ టౌన్‌ (బోధన్‌): ఈ నెల 28వ తేదీన బోధన్‌ కోర్టులో నిర్వహించనున్న లోక్‌ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోర్టు అధికారులు కోరారు. పరిష్కారానికి అవకాశం ఉన్న క్రిమినల్‌ కేసులపై శుక్రవారం కోర్టులో సమావేశం నిర్వహించారు. సమావేశంలో పెండింగ్‌లో ఉన్న క్రిమినల్‌ కేసుల గురించి పోలీసు అధికారులను న్యాయమూర్తులు అడిగి తెలుసుకున్నారు. లోక్‌ అదాలత్‌లో అనేక కేసులు పరిష్కారమవుతున్నాయని, ఆ దిశగా అధికారులు ఇద్దరి మధ్య సయోధ్య కుదిర్చి కేసులు పరిష్కారం అయ్యేలా లోక్‌అదాలత్‌ను వినియోగించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో న్యాయమూర్తులు రవికుమార్‌, అజయ్‌ కుమార్‌, పూజిత, సాయి శివతోపాటు ఏపీపీ సమ్మయ్య, పోలీస్‌ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సదస్సును జయప్రదం చేయండి



బ్రోచర్స్‌ను ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్‌ సుధాకర్‌రెడ్డి, అధ్యాపకులు

తెయూ(డిచ్‌పల్లి): అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక మహాసంఘ్‌, ఇండియన్‌ కౌన్సిల్‌ ఆఫ్‌ సోషల్‌ సైన్స్‌ రీసెర్చ్‌ (ఐసీఎస్‌ఎస్‌ఆర్‌) సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 21న నిర్వహించే అఖిల భారత మహిళా యూనివర్సిటీ అధ్యాపకుల సదస్సును విజయవవంతం చేయాలని ఐసీఎస్‌ఎస్‌ఆర్‌ డైరెక్టర్‌ ప్రొఫెసర్‌ సుధాకర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు శుక్రవారం తెయూలో సదస్సు బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఉస్మానియా యూనివర్సిటీ ఠాగూర్‌ ఆడిటోరియంలో సదస్సు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. యూనివర్సిటీ స్థాయిలో ఉండే మహిళా అధ్యాపకులు హాజరై సదస్సును విజయవంతం చేయాలన్నారు. వికసిత్‌ భారత్‌లో మహిళా అధ్యాపకుల పాత్ర, పరిశోధనలను సదస్సులో చర్చిస్తారని తెలిపారు. తెయూ ప్రిన్సిపాల్‌ సీహెచ్‌ ఆరతి, అధ్యాపకులు స్వప్న, స్రవంతి, పద్మ, రమ్య, నీలిమ, రవీందర్‌రెడ్డి, వాసం చంద్రశేఖర్‌, నాగరాజు, పున్నయ్య, సంపత్‌, పరిశోధక విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మల్కాపూర్‌లో చిరుత సంచారం



నిజామాబాద్‌ రూరల్‌: మల్కాపూర్‌ శివారులో చిరుత సంచరిస్తున్నట్లు స్థానికులు పేర్కొన్నారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం .. గ్రామంలో ప్రాణహితచేవెళ్ల పనులు కొనసాగుతున్న ప్రాంతంలో చిరుత కనిపించినట్లు పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం ప్రాణహిత చేవెళ్ల పనుల కోసం వెళ్లే అధికారులు కారులో వెళ్తుండగా చిరుతను చూసి చరవాణిలో దృశ్యాలు తీసినట్లు తెలిపారు. చిరుత సంచారంపై అటవీ రేంజ్‌ అధికారి సంజయ్‌కుమార్‌గౌడ్‌ వివరణకు కోరగా తమకు ఇప్పటి వరకు ఎలాంటి సమాచారం అందలేదన్నారు.

క్రైం కార్నర్‌

సీజనల్‌ వ్యాధితో తనువు చాలించిన యువతి



రెంజల్‌: ఉద్యోగ వేటలో విజయం సాధించిన యువతి సీజనల్‌ వ్యాధి బారిన పడి తనువు చాలించింది. జీవితంలో స్థిరపడేందుకు హైదరాబాద్‌లోని ఓ సాఫ్ట్‌వేర్‌ కంపెనీలో ఉద్యోగంలో చేరి తల్లిదండ్రులకు చేదోడుగా నిలవాలనుకున్న యువతి వారికి తీరని శోకాన్ని మిగిల్చింది. రెంజల్‌ మండలం నీలా గ్రామానికి చెందిన క్యాతం శిరీష(24) గురువారం రాత్రి జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. డెంగీతో శిరీష మృతిచెందినట్లు వాట్సాప్‌ గ్రూపుల్లో స్థానికులు షేర్‌చేశారు. దీంతో ఎంపీడీవో వెంకటేశ్‌ జాదవ్‌, పీహెచ్‌సీ వైద్యుడు వినయ్‌కుమార్‌, గ్రామ ప్రత్యేకాధికారి మున్నీ నాయక్‌, ఆరోగ్య విస్తరణ అధికారి రవీందర్‌ గ్రామానికి చేరుకుని విచారించారు. డెంగీతో మృతచెందలేదని నిర్ధారించారు. పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటం వల్ల సీజనల్‌ వ్యాధి సోకి తీవ్రమైన జ్వరంతో అనారోగ్యానికి గురై మృతిచెందినట్లు డాక్టర్‌ పేర్కొన్నారు. గ్రామంలో పరిసరాలను శుభ్రం చేయించాలని కార్యదర్శికి అధికారులు సూచించారు.

నిందితుడికి మూడు నెలల జైలు

వర్ని: దొంగతనానికి పాల్పడిన వ్యక్తికి రెండు నెలల జైలు శిక్ష విధిస్తూ బోధన్‌ ప్రథమ శ్రేణి న్యాయమూర్తి సాయిశివ శుక్రవారం తీర్పు ఇచ్చినట్లు ఎస్సై కృష్ణకుమార్‌ వెల్లడించారు. 2020 నవంబర్‌లో కేసరి పద్మ అనే మహిళ బస్టాండ్‌ నుంచి వెళ్తుండగా సేవాలాల్‌ తండాకు చెందిన మెగావత్‌ రాజు సదరు మహిళ నుంచి ఫోను, పర్సును బలవంతంగా లాక్కొని పారిపోగా బాధితురాలు పీఎస్‌లో చేసింది. విచారణ చేపట్టిన పోలీసులు రాజుపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పర్చగా నేరం రుజువైంది. దీంతో నిందితుడికి మూడు నెలల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చినట్లు ఎస్సై పేర్కొన్నారు.

తల్లిదండ్రులు మందలించారని ఆత్మహత్య

పిట్లం: తల్లిదండ్రులు మందలించారని ఓ యువకుడు క్షణికావేశంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని తిమ్మనగర్‌లో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన నాందేవ్‌(23) ఎలాంటి పని లేకుండా ఖాళీగా తిరుగుతుండేవాడు. దీంతో తల్లిదండ్రులు మందలించడంతో క్షణికావేశంలో గ్రామ శివారులోని పొలంలో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పీడీఎస్‌ బియ్యం పట్టివేత

ఖలీల్‌వాడి: నగరంలోని ఆరోటౌన్‌ పీఎస్‌ పరిధిలో పీడీఎస్‌ బియ్యం పట్టుకున్నట్లు ఎస్సై వెంకట్రావు శుక్రవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. నిజాంకాలనీ-అర్సపల్లి మధ్య ఓ టాటా బొలెరోలో 75 సంచుల్లో ఉన్న సుమారు 44 క్వింటాళ్ల పీడీఎస్‌ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్‌ పోలీసులు పట్టుకున్నట్లు పేర్కొన్నారు. వాహన డ్రైవర్‌ అజయ్‌ గోడేకర్‌ పట్టుకొని విచారించగా నవీపేట్‌ మండలానికి చెందిన హాజీతో కలిసి పీడీఎస్‌ బియ్యాన్ని మహారాష్ట్రకు తరలిస్తున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

సంగోజీవాడిలో..



తాడ్వాయి: మండలంలోని సంగోజీవాడి గ్రామంలో నిల్వ ఉంచిన పీడీఎస్‌ బియ్యాన్ని టాస్క్‌ ఫోర్సు అధికారులు శుక్రవారం పట్టుకున్నారు. గ్రామానికి చెందిన పార్శి గణపతి తన ఇంట్లో అక్రమంగా పీడీఎస్‌ బియ్యం నిల్వ ఉంచాడనే విషయం తెలుసుకున్న అధికారులు అక్కడికి చేరుకున్నారు. 9.30 క్వింటాళ్ల బియ్యాని పట్టుకొని గణపతిని అరెస్టు చేశారు. టాస్క్‌ఫోర్స్‌ ఆఫీసర్‌ శ్రీనివాస్‌, ఎస్సై వెంకటేశ్వర్లు, ఏఎస్సై సంజీవులు, ఆర్‌ఐ లక్ష్మణ్‌ ఉన్నారు.

ముత్యంపేటలో విషాదఛాయలు

- రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ ఇద్దరి మృతి



ముత్తి రమేశ్‌ (ఫైల్‌)

దోమకొండ: మండలంలోని ముత్యంపేట గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా చికిత్స పొందుతూ రెండు రోజుల వ్యవధిలో మృతి చెందారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ నెల 10న వినాయకుడికి పూజ సామాను తీసుకురావడానికి గ్రామానికి చెందిన జొన్నల రాము, ముత్తి రమేశ్‌ కామారెడ్డికి వెళ్లి తిరిగి వస్తుండగా ఉగ్రవాయి-భవానిపేట స్టేజి వద్ద ఎదురుగా వచ్చిన మరో బైక్‌ వీరిని ఢీకొన్నది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ వీరిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ రాము గురువారం మృతి చెందగా, ముత్తి రమేశ్‌(23) శుక్రవారం మృతి చెందాడు. కామారెడ్డిలో ప్రైవేట్‌ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్న రమేశ్‌ మృతితో కుటుంబసభ్యుల రోదన మిన్నంటాయి.

చికిత్స పొందుతూ ఒకరి మృతి



రాజమణి (ఫైల్‌)

మోర్తాడ్‌: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ మహిళ ఆత్మహత్యకు యత్నించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. భీమ్‌గల్‌ పట్టణంలోని అయ్యప్పనగర్‌కు చెందిన పోతుగంటి రాజమణి(48) అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది గురువారం ఇంట్లో ఉన్న యాసిడ్‌ను సేవించింది. గమనించిన కుటుంబీకులు స్థానిక ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు ఆర్మూర్‌కు తరలించగా అక్కడి నుంచి జిల్లా కేంద్రానికి తరలించారు. చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందింది. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం.. బాలిక కిడ్నాప్‌

- తెలంగాణ యువకుడు.. ఆంధ్ర అమ్మాయి
- పెళ్లి చేసుకునేందుకు అన్నవరం వెళ్తుండగా అడ్డుకున్న ఎస్సై
- ముగ్గురు నిందితుల అరెస్ట్‌
- మిగిలిన వారి కోసం గాలింపు

ద్వారకాతిరుమల: ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన 14 ఏళ్ల బాలికకు మాయమాటలు చెప్పి కిడ్నాప్‌ చేసిన యువకుడిని, అతడికి సహకరించిన కుటుంబ సభ్యులను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల ఎస్సై టి.సుధీర్‌ తెలిపిన కథనం ప్రకారం.. మండలంలోని కోడిగూడెం గ్రామానికి చెందిన బాలికకు తెలంగాణలోని నిజామాబాద్‌ జిల్లా జక్రాన్‌పల్లి గ్రామానికి చెందిన గండికోట దశరథ్‌ అనే యువకుడితో ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం ఏర్పడింది. దశరథ్‌ బాలికను ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి నమ్మించాడు. ఈ క్రమంలో దశరథ్‌ ఈనెల 11న ఉదయం తన తల్లిదండ్రులు గండికోట ఎల్లయ్య (వెంకట్‌), లక్ష్మి, చిన్నాన్న గండికోట అశోక్‌, బావలు పండ్ల రాము, వల్లపు సురేష్‌తో కలసి కారులో కోడిగూడెంలోని బాలిక ఇంటికి వెళ్లాడు. బాలికకు మాయమాటలు చెప్పి లొంగదీసుకుని, పెళ్లి చేసుకునేందుకు తీసుకెళ్లాడు. దీనిపై బాలిక తండ్రి చొక్కా సుధాకర్‌ ఇచ్చిన ఫిర్యాదుపై అదే రోజు ఎస్సై సుధీర్‌పై కిడ్నాప్‌, పలు సెక్షన్లపై కేసు నమోదు చేశారు. ఏలూరు జిల్లా ఎస్పీ ప్రతాప్‌ శివకిశోర్‌ ఆదేశాలతో ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్‌ ఆధ్వర్యంలో భీమడోలు సీఐ జోసఫ్‌ విల్సన్‌ పర్యవేక్షణలో ఈ కేసును ఎస్సై సుధీర్‌ దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో బాలికను పెళ్లి చేసుకునేందుకు శుక్రవారం ఓ కారులో అన్నవరం తీసుకెళ్తుండగా మార్గమధ్యలో ఎం.నాగులపల్లి జాతీయ రహదారిపై ఎస్సై సుధీర్‌ సిబ్బందితో కలిసి వారిని అడ్డుకున్నారు. అనంతరం దశరథ్‌ను, అతని తల్లిదండ్రులను అరెస్టు చేశారు. కిడ్నాప్‌కు ఉపయోగించిన కారును సీజ్‌ చేశారు. మిగిలిన నిందితుల కోసం గాలిస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

డిచ్‌పల్లి: మండల పీఎస్‌ పరిధిలోని ధర్మారం(బి) శివారులో పేకాట స్థావరంపై టాస్క్‌ ఫోర్స్‌ పోలీసులు దాడి చేశారు. శుక్రవారం రాత్రి ధర్మారం శివారులో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో టాస్క్‌ ఫోర్స్‌ తనిఖీలు చేపట్టారు. పేకాట ఆడుతున్న 10 మందిని అరెస్ట్‌ చేసి వారి నుంచి రూ.12 నగదును సీజ్‌ చేసి డిచ్‌పల్లి పోలీసులకు అప్పగించారు.

కరడ్‌పల్లిలో..

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని కరడ్‌పల్లిలో శుక్రవారం పేకాట స్థావరంపై దాడి చేసినట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. గ్రామంలోని ఓ కొట్టంలో ఐదుగురు పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు దాడి చేసి అదుపులోకి తీసుకున్నామన్నారు. ఐదుగురిపై గేమింగ్‌యాక్టు కింద కేసునేమోదు చేసి రూ.8వేల నగదు సీజ్‌ చేశామన్నారు.

అటవీ భూములను చదును చేస్తున్న ట్రాక్టర్ల పట్టివేత



ఇందల్వాయి: ఇందల్వాయి ఫారెస్ట్‌ రేంజ్‌ పరిధిలోని ధర్పల్లి మండలం దుబ్బాక గ్రామం కంపార్ట్‌మెంట్‌-380, ఇందల్వాయి మండలం చంద్రాయన్‌పల్లి గ్రామాల పరిధిలో అటవీ భూములను ఆక్రమించి చదును చేస్తున్న మూడు ట్రాక్టర్లను శుక్రవారం పట్టుకొని సీజ్‌ చేసినట్లు ఎఫ్‌ఆర్వో రవి మోహన్‌ భట్‌ తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా అటవీ భూములను కబ్జా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎక్కడైనా అటవీ సంపద దోపిడీకి గురైతే ప్రజలు సమాచారం అందించాలని కోరారు. ఆయన వెంట సెక్షన్‌ అధికారి తుకారం రాథోడ్‌, బీట్‌ అధికారులు ఖాదీర్‌, రంజిత్‌, సందీప్‌, స్ట్రైకింగ్‌ ఫోర్స్‌ సిబ్బంది వంశీ, హరీశ్‌ ఉన్నారు.

ఇసుక టిప్పర్‌ పట్టివేత



రుద్రూర్‌: పొతంగల్‌ మండలంలోని మంజీరా నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను శుక్రవారం తెల్లవారుజామున పట్టుకున్నట్లు కోటగిరి ఎస్సై సందీప్‌ తెలిపారు. తగుచర్య నిమిత్తం సంబంధిత అధికారులకు సమాచారం అందించినట్లు ఆయన పేర్కొన్నారు.

డయల్‌ 100 దుర్వినియోగం

- ముగ్గురికి జైలు శిక్ష

ధర్పల్లి: అత్యవసర సేవల కోసం ఏర్పాటు చేసిన డయల్‌-100ను దుర్వినియోగం చేసి పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన ముగ్గురికి జిల్లా సెకండ్‌ క్లాస్‌ మెజిస్ట్రేట్‌ రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై రామకృష్ణ శుక్రవారం పేర్కొన్నారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని సీతాయిపేట్‌కు చెందిన చెప్యాల బాబు, సుంచ రాజు, డీబీ తండాకు చెందిన గుగ్లోత్‌ అనిల్‌ ప్రతిసారి డయల్‌-100కు ఫోన్‌ చేసి పోలీసుల విధులకు ఆటంకం కలిగించడంతోపాటు సేవలను దుర్వినియోగం చేశారు. దీంతో వీరిపై కేసు నమోదు చేసి శుక్రవారం కోర్టులో హాజరు పరచగా సాక్ష్యాలను పరిశీలించిన జడ్జి రెండు రోజుల జైలు శిక్షను విధించినట్లు ఎస్సై పేర్కొన్నారు. మద్యం మత్తులో ఆకతాయిలు డయల్‌100కు ఫోన్‌ చేసి విలువైన సమయాన్ని వృథా చేస్తున్నారని అలాంటి సమయాల్లో అత్యవసర పరిస్థితుల్లో ఉన్నవారికి సహాయం అందించలేకపోతున్నామని అన్నారు. ఎవరైనా పోలీసుల విధులకు ఆటంకం కలిగిస్తే తగు చర్యలు తప్పవని హెచ్చరించారు.

వాహనాల తనిఖీ

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లో వాహనాల తనిఖీ చేపట్టినట్లు ట్రాఫిక్‌ ఏసీపీ నారాయణ శుక్రవారం తెలిపారు. మద్యం సేవించి వాహనం నడిపిన ఆరుగురికి రూ. 11వేల జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. అనంతరం వీరిని కోర్టులో హాజరు పర్చగా మెజిస్ట్రేట్‌ అజ్మీర సంకేత్‌కుమార్‌ డిచ్‌పల్లిలోని మానవతాసదన్‌లో ఒకరోజు సోషల్‌ సర్వీస్‌ చేయాలని ఆదేశించినట్లు ట్రాఫిక్‌ ఏసీపీ నారాయణ తెలిపారు.

చెరువులో పడి ఒకరి మృతి



నాగిరెడ్డిపేట: ప్రమాదవశాత్తు చెరువులో పడి ఒకరు మృతి చెందిన ఘటన మండలంలోని వెంకంపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై మల్లారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మాటూరి రవి(45) తాండూర్‌ శివారులోని నాగనయ్య చెరువులో ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. గురువారం తాండూర్‌లో పనిఉందని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన రవి తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు అతని కోసం గాలించగా నాగనయ్య చెరువు మెట్ల వద్ద రవి చెప్పులు కనిపించాయి. శుక్రవారం ఉదయం గజ ఈతగాళ్ల సాయంతో చెరువులో గాలించగా రవి మృతదేహం లభ్యమైంది. చెరువులో కాలు కడుకునేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు అందులో పడి మృతి చెంది ఉంటాడని కుటుంబీకులు తెలిపారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.